# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-09-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **నేపాల్లో చిక్కుకున్న తెలుగువారిని రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశామని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**
2. **విజయవాడలో అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**
3. **దేశ ఆర్థిక వ్యవస్థను జీఎస్టీ సంస్కరణలు పూర్తి పారదర్శకంగా మార్చనున్నాయని 20 సూత్రాల అమలు చైర్మన్ లంక దినకర్ అన్నారు.**
4. **స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 'చాయ్ పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ వెల్లడించారు.**

==========================

నేపాల్లో చిక్కున్న తెలుగువారిని విమానాల ద్వారా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశామని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్రానికి చెందిన వారిని తీసుకువచ్చేందుకు తీసుకుంటున్న ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ వాసులు ఈరోజు సాయంత్రంలోపు విమానాల ద్వారా రాష్ట్రానికి వస్తారని, విశాఖపట్నం, విజయవాడ, కర్నూలు విమానాశ్రయాలకు చేరుకునే వారికి స్థానిక ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికాలని అన్నారు. అక్కడనుండి తదుపరి వారి వారి స్వస్థలాలకు సురక్షితంగా చేర్చేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

--------------------------

విజయవాడలో అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నగరంలోని కొత్త రాజరాజేశ్వరి పేటలో అతిసార కేసులు నమోదైన ప్రాంతాల్లో స్థానిక శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి మంత్రి ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. డయేరియా ప్రబలడానికి గల కారణాలపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ...

..వాయిస్.. 30 సెకన్లు

ఇది ఇలా ఉండగా అతిసార బాధితులకు చికిత్స కొనసాగుతుందని అందరి పరిస్థితి నిలకడగా ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. విజయవాడలో ఈరోజు ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 41 మందికి చికిత్స అందిస్తున్నామన్నారు. ఆరోగ్యం మెరుగుపడటంతో ఇప్పటి వరకు 22 మంది డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. ముందు జాగ్రత్తగా కుళాయి నీటి సరఫరా ఆపేసి 15 ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. అతిసార కేసులపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 91549 70454 హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాటు చేసామని జిల్లా కలెక్టర్ వివరించారు.

---------------------------

దేశ ఆర్థిక వ్యవస్థను వస్తు, సేవల పన్ను- జీఎస్టీ సంస్కరణలు పూర్తి పారదర్శకంగా మార్చనున్నాయని 20 సూత్రాల అమలు చైర్మన్ లంక దినకర్ తెలిపారు. విజయవాడలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యానికి సంబంధించిన చికిత్స పరికరాలు, సామాగ్రి కూడా జీరో జీఎస్టీ పరిధిలోకి రావటం ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. అలాగే విద్యా రంగానికి సంబంధించిన మ్యాప్‌లు, పుస్తకాలు వాటిపై గతంలో ఉన్న 5 శాతం, 12 శాతం జీఎస్టీని పూర్తిగా రద్దు చేయడం ద్వారా విద్యార్థులకు అందుబాటు ధరల్లో లభిస్తాయని అన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వస్తు సేవల పన్ను-జీఎస్టీ సంస్కరణలతో వ్యాపారస్తులతో పాటు ప్రజలకు ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలలో కొనుగోళ్ళు శక్తి పెరుగుతుందని, తద్వారా వాణిజ్యం పెరుగుతుందని విశాఖపట్నానికి చెందిన స్థానికుడు ఆకాశవాణికి తెలియజేస్తూ..

..వాయిస్...30 సెకన్లు

---------------------------

స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 'చాయ్ పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. అనకాపల్లిలో ఈరోజు ఉదయం నిర్వహించిన 'చాయ్ పే చర్చ' కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా కేంద్రంలో సౌకర్యాలు మెరుగుపరచాలని, యోగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో రైలు హాల్టు ఏర్పాటు చేయాలని, చక్కెర కర్మాగారాల సమస్యను పరిష్కరించాలని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మాధవ్ తెలిపారు.

---------------------------

అమరావతిలో పర్యావరణ, సామాజిక అంశాల అమలు తీరును పరిశీలించేందుకు మొత్తం 12 మందితో కూడిన ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ప్రతినిధుల బృందం రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పర్యటిస్తోంది. ఈ బృందం ఈరోజు అమరావతిలో క్షేత్రస్థాయిలో వివిధ పనుల నిర్మాణ తీరును పరిశీలిస్తోంది. గెజిటెడ్ అధికారులు, ఎన్జీవోల నివాస సముదాయాల పనులను పరిశీలించింది. అనంతరం ఈ-6 రోడ్డు, ఎల్పీఎస్ జోన్లు 2ఏ, 1ఏలో మౌలిక వసతుల కల్పన పనులను పరిశీలిస్తుంది. తర్వాత శాఖమూరు, నీరుకొండ జలాశయాల పనులను పరిశీలిస్తుందని అధికారులు తెలిపారు. రేపు రాజధానిలో నిర్మాణ పనుల

పురోగతిపై ఈ బృందం అధికారులతో సమావేశంకానుంది.

---------------------------

కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ...

..వాయిస్...30 సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా-పీఎంశ్రీ పథకం వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో నిలిచిందని సమగ్ర శిక్షా అభియాన్ పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించేందుకు దక్షిణాది రాష్ట్రాల్లో అత్యధిక పాఠశాలలు ఎంపికైన మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. అలాగే జాతీయ స్థాయిలో ఉత్తరప్రదేశ్ తర్వాత రాష్ట్రం రెండో స్థానంలో నిలిచిందని చెప్పారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 14 వేల 500 పాఠశాలలను కేంద్రం ఎంపిక చేయగా.. రాష్ట్రం నుంచి 982 పాఠశాలలు ఉన్నాయని వాటిలో కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు ఉండగా 9 వందల 35 రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు ఈ పథకానికి ఎంపికయ్యాయని తెలిపారు.

---------------------------

దక్షిణ ఒడిషా, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి సగటున 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..26 సెకన్లు

---------------------------

ఏలూరు జిల్లాలోని 175 చెరువులకు సంబంధించి 160.25 కోట్ల రూపాయలతో మరమ్మతులు, పునర్నిర్మాణాల పనుల ప్రతిపాదనలను జిల్లా స్థాయి పరిశీలన కమిటి ఆమోదించిందని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

=====================